క్లుప్తంగా

డైరెక్టర్ వేదకుమారికి సత్కారం


వేదకుమారిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ప్రతిష్టాకరమైన విజయవాడ కనకదుర్గమ్మవారి ట్రస్టు బోర్డు డైరెక్టర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు సహకారంతో ఉన్నత పదవి పొందిన వేదకుమారి అభినందనీయురాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం శ్రీరామవరం ఆయన నివాసంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు పార్టీ నాయకులు కామిరెడ్డి బాలు, ప్రతాప్, కొత్తపల్లి రాఘవులు, రాంబాబుతో కలిసి వేదకుమారిని సత్కరించారు. అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. డైరెక్టర్‌గా పదవి దెందులూరు మండలానికి కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఎన్నికల కోడ్ కూసింది


గోపన్నపాలెంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ఫ్లెక్సీ తొలగిస్తున్న దృశ్యం

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా కోడ్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలుకు విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు సహాయ సహకారాలు అందించి ఫ్లెక్సీల తొలగింపునకు సహకరించాలని అన్ని గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గోపన్నపాలెంలో వారు ఫ్లెక్సీలను తొలగించారు. సోమవారం మిగిలిన గ్రామాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు వివరించారు.

మలేషియాలో శిక్షణకు దెందులూరు విద్యార్థి ఎంపిక


శుభాష్

దెందులూరు: కెలం ట్రాన్ మలేషియా విశ్వవిద్యాలయంలో శిక్షణ కోసం బాపట్ల లోని వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న దెందులూరుకి చెందిన బళ్ల కుమారమ్మ మనవడు శుభాష్ ఎంపికయ్యారని బాపట్ల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ వీ.శ్రీనివాసరావు తెలిపారు. సంస్థాగత అభివృద్ధి, ప్రణాళికలో భాగంగా సేంద్రియ సాగు ఉద్యానవన శాఖలపై ఈ నెల 14 నుంచి మార్చి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు శిక్షణనిస్తారని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉన్నత సాంకేతిక విలువలు పెంపొందించడం, సాగులో మెళకువలు శిక్షణ ద్వారా విద్యార్థులు నేర్చుకోవచ్చని తెలిపారు. దెందులూరు విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణకు ఎంపిక కావడంపై బళ్ళ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

20 నుంచి కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): పట్టణంలోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 20 నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నట్టు సంస్థ పీఆర్ఓ పులి శ్రీరాములు ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీ, ఇంటర్ (కామర్స్) ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 20 వరకూ సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందజేస్తారని, ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన 18–35 సంవత్సరాల వయస్సు ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

భగవద్గీత పారాయణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వ శాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలాపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీనం దత్తనాథ క్షేత్రం భగవద్గీత పారాయణ బృందం సభ్యులు భగవద్గీతలోని 18 అధ్యాయాలను అత్యంత భక్తి శ్రద్ధలతో పారాయణ చేశారు. అనంతరం స్వామి వారికి సహస్ర నామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషంగా అలంకరించారు. సాయంత్రం 5.30 గంటలకు వేదాంతం విష్ణుప్రసాద్ హైందవ ధర్మ విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన రామానుజ నృత్యధార సంస్థ ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ పూజలు నిర్వహించగా గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

శివపార్వతుల కల్యాణానికి ముస్తాబైన శైవక్షేత్రాలు

- బలివే తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు
- ఫిబ్రవరి 16 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు


బలివే రామలింగేశ్వరస్వామి ఆలయం ముఖద్వారం


ఆలయ ఆవరణలో బారికేట్లు, షామియానాల ఏర్పాటు

పెదవేగి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. విజయరాయి శివారు ప్రాంతం బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేసారు. ఇక్కడ ఏటా మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. కృష్ణా, ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వేలాది మంది బలివేలో స్వామిని దర్శించుకుని, పితృ దేవతలకు తర్పణాలు వదులుతారు. ఉత్సవాలను ఫిబ్రవరి 16వ నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 18న శనివారం రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించనున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి, కమిటీ సభ్యులు చెబుతున్నారు.

పితృదేవతలకు తర్పణాలు

తమ్మిలేరు ఒడ్డున బలివేలో శ్రీరామలింగేశ్వరస్వామి లింగాన్ని శ్రీరాముడు ప్రతిష్టించి, పూజలు చేసినట్టు ప్రతీతి. ఇక్కడ మహాశివరాత్రి నాడు వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. మహాశివరాత్రి రోజున తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తమ్మిలేరులో స్నానాలు చేసి, పితృదేవతలకు తర్పణాలు అందిస్తారు. దీంతో పితృదేవతలకు మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మిక.దక్షిణ కాశీగా పేరొందిన శ్రీ రామలింగేశ్వర స్వామి బలివే ఆలయంలో పశ్చిమ అభిముఖంగా కొలువై భక్తులకు దర్శనమిస్తారు.

బలివే తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

మహాశివరాత్రి పురస్కరించుకుని బలివే తిరునాళ్ళకు లక్షల సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేకఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు మేడికొండ కృష్ణారావు అన్నారు. బలివే రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలమేరకు ఆదివారం అధికారులు, దేవస్థాన సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయరాయి నుంచి బలివేకు త్వరలో శాశ్వత వంతెన నిర్మిస్తామని చెప్పారు. తొలుత ఆయన ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఫిబ్రవరి 16నుంచి ప్రారంభం కానున్న తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని అన్నారు. తమ్మిలేరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశామన్నారు. తిరునాళ్లకు ముందే సుమారు 500 క్యూసెక్కుల నీటిని నిల్వ చేస్తామని తెలిపారు. అనంతరం బలివేకి వచ్చే రోడ్డు, పార్కింగ్, స్టాల్స్ ఏర్పాటుపై అధికారులు, నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో విజయరాయి సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి, ఏలూరు రూరల్ సీఐ ఎన్ దుర్గాప్రసాద్, పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్, మేడికొండ కృష్ణారావు, బొద్దు సతీష్, కేశన సతీష్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


బలివే రామలింగేశ్వర స్వామి

జల్లు స్నానాలకు ఏర్పాట్లు

ఆలయ ప్రాంగణమంతా సుందరంగా తీర్చిదిద్దాం. సుమారు 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గుజరాతీ పందిళ్లు వేసి, శానిటేషన్ పూర్తిస్థాయిలో నిర్వర్తించాం. అన్ని ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా మూడు చోట్ల జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశాం. వృద్ధులకు, చిన్నారులకు ప్రత్యేక దర్శనంతోపాటు, వైద్య సిబ్బంది, పోలీస్ వారు ఉండటానికి సదుపాయం కల్పించాం.

– సీ జయప్రకాష్,
కార్యనిర్వహణాధికారి, బలివే దేవస్థానం

ఇంటింటా సంక్షేమ కాంతులు

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కె కన్నాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం


ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మండలంలోని కె కన్నాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లుగా ఏటా వేల కోట్ల రూపాయల వ్యయంతో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతూ ఆర్థికంగా బలపడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 12వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు జారీ చేసి గృహ నిర్మాణాలకు అనుమతులిచ్చి సొంతింటి కల నెరవేరుస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం విద్యాపరంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ అభిమతమని అన్నారు. ఇందుకనుగుణంగా పలు పథకాలు అమలు చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మహిళలంతా ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, ముండూరు సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి ప్రసాదరావు, సప్పా మోహనమురళి, ముస్సె శ్రీను, బలుసు మునికుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, బొల్లి లక్ష్మణరావు, మారగాని సత్యనారాయణ, కట్టా నాగరాజు, ముత్యాల గణపతి, చినాల సత్యనారాయణ, కమ్మిలి నాగేంద్ర, మారగాని రామకృష్ణ, కమ్మిలి వెంకటరత్నం, చిలుకూరి రాంబాబు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగారత్నం మృతి తీరని లోటు

పెదవేగి : మంచి వ్యక్తిత్వం ఉన్న గొప్ప మనిషి గంగారత్నం లేనిలోటు తీరనిదని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో మెట్లపల్లి గంగారత్నం సంతాప సభలో ఎమ్మెల్యే కొఠారు పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మెట్లపల్లి సూరిబాబు, కేశన సతీష్, తోట పద్మారావు, మెట్లపల్లి అజయ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం


టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉందని, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో దెందులూరు నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆయన అన్నారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన పంది కొండలరావు, దాసరి సుబ్బారావు, సిమట నాగరాజు, పంది సుబ్బారావు, వీరమల్లు రాజును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముండూరు సొసైటీ ప్రెసిడెంట్ చెరుకూరి ప్రసాద్, ఎంపీటీసీ కో ఆప్షన్ మెంబర్ పాకలపాటి ఫిలిప్, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ముస్సె శ్రీను, నాయకులు పంది జగన్, టి పెద్దిరాజు, పంది కొండలరావు, పంది శ్రీనివాసరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి చేరుకునేందుకు చదువే సోపానం


నీతి కథలు చెబుతున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్

భీమడోలు: ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు పుస్తక పఠనం చక్కని సోపానమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తకపఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల నిర్వహణకు డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి ప్రోత్సాహం అందిస్తున్నారని అన్నారు. పది వారాలుగా చదవడం మాకిష్టం కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరైన చిన్నారులకు ఉచితంగా వారికి నచ్చిన పుస్తకాలను అందించేందుకు ఈనెల 14న మంగళవారం విజయవాడ పుస్తక ప్రదర్శనకు వారిని తీసుకు వెళ్లారని గ్రంథపాలకుడు కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు అందిపుచ్చుకోవచ్చన్నారు. పలు స్ఫూర్తిదాయక కథలను చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను చిన్నారులు తిలకించారు. ఈ కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, రీడర్స్ ఫోరం సభ్యుడు పీవీ రాఘవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్న కార్మికులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవడం బాధాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మంచి ఆహారాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద నిత్యం అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

బంజారా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణ

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగ్గులోతు కృష్ణనాయక్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా బోడా బాల నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆదివారం జాతీయ ఉపాధ్యక్షులు పీఎల్ రవీంద్ర నాయక్ నూతన కమిటీతో పదవీ స్వీకారం చేయించినట్లు గుగ్గులోతు కృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ లంబాడి జాతి అభివృద్ధికి కృషి చేస్తానని, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతానని అన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన గుగ్గులోతు కృష్ణ నాయక్, బోడా బాలా నాయక్‌లను పలువురు బంజారా నాయకులు అభినందించారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

దెందులూరు: చిన్నారుల విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు శివారు ప్రాంతాల్లో డ్రాప్ అవుట్స్ విద్యార్థులను సర్వే ద్వారా గుర్తించి, వారు మళ్లీ బడులకు వెళ్లేందుకు కృషి చేయడం అభినందనీయమని నాగులదేవునిపాడు, గాలాయగూడెం, అక్కిరెడ్డిగూడెం గ్రామస్తులు, ఆర్‌సీఎం సంఘ పెద్దలు అన్నారు. ఆదివారం ఫారీస్ క్రీస్ట్ ఫాదర్ గ్జేవియర్‌ను ప్రజలు, ఉపాధ్యాయులు మరియదళ సభ్యులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నాగులదేవునిపాడు ఆర్‌సీఎం విచారణ పరిధిలో శివారు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, విద్య, వైద్య సేవలందించడం స్ఫూర్తి దాయకమన్నారు.

20న ప్రాజెక్టుల సందర్శన

ఏలూరు (టూటౌన్): చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టును ఈ నెల 20న సీపీఐ,రైతు సంఘం ప్రతినిధి బృందం పరిశీలిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ నెల 13 నుంచి అప్పర్ భద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ సందర్శన కార్యక్రమం శ్రీకాకుళం వరకూ కొనసాగుతుందని అక్కినేని వనజ అన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి


గుండుగొలనులో జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 1982-83 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

భీమడోలు: నాలుగు దశాబ్దాల కితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక ఆదివారం సందడిగా సాగింది. గుండుగొలను మావులేటి సోమరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల దీనికి వేదికై ంది. పాఠశాలలో 1982–83 టెన్త్ బ్యాచ్‌కు చెందిన ఐదు పదుల దాటిన 75 మంది పూర్వ విద్యార్థులంతా కుటుంబ సమేతంగా పాఠశాలకు వచ్చి తమ బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. గురువులతో పాటు పూర్వ విద్యార్థులు తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో వారంతా పులకరించారు. చిన్నతనంలో ఆటలాడిన ప్రాంతాలను, తరగతి గదులను సందర్శించి మధురానుభూతితో వారంతా ఆనందడోలికల్లో మునిగి తేలారు. పూర్వ విద్యార్థులు స్నేహితుల కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. పాఠాలు బోధించి విజ్ఞానమనే వెలుగులు నింపిన అప్పటి గురువులకు జీవితాంతం రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు సంఘమేశ్వరరావు, అన్నపూర్ణ, రమణకుమార్, హెచ్‌ఎం గారపాటి కనకదుర్గా సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడు ఉపాధ్యాయులకు సంతృప్తి లభిస్తుందని అన్నారు. వివిధ వృత్తులు, ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో, ప్రజాప్రతినిధులుగా ఉన్నతంగా జీవిస్తున్నామని పూర్వ విద్యార్థులు తెలియజేయడంతో గురువులు సంతోషంగా వ్యక్తం చేసారు. తొలుత మృతి చెందిన తమ స్నేహితులకు నివాళులు అర్పించారు. అనంతరం గురువులతో ఫొటోలు దిగారు. అనంతరం గురువులను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక అందించారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.